ప్రజాశక్తి
ఆదివారం 13 జులై 2025
5
అల్లూరి సీతారామరాజు



పాలిటెక్నిక్ కళాశాలను రద్దు చేయడం అన్యాయం

ప్రజాశక్తి-చింతపల్లి: పేద విద్యార్థుల సేంద్రియ వ్యవసాయ విద్య కలలను నిర్వీర్యం చేయడం తగదని చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత ఆవేదన వ్యక్తం చేశారు. 2011లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చింతపల్లి ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో ప్రారంభమైన సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అనేక మంది నిరుపేద విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచిందని ఆమె గుర్తు చేశారు. కడప, తిరుపతి, ఖమ్మం వంటి దూర ప్రాంతాల నుంచి ఎందరో పేద విద్యార్థులు ఈ పాలిటెక్నికల్ కళాశాలలో చేరి విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా స్థిరపడ్డారని ఆమె తెలిపారు. ఇది పేదలకు ఆశాజ్యోతి అని ఆమె వివరించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలను రద్దు చేయడం బాధాకరమన్నారు. ఇది గిరిజనులు, పేద విద్యార్థుల భవిష్యత్తుకు విఘాతం కలిగించడేమ అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న విద్యాలయాలను మరింత అభివృద్ధి చేయకుండా రద్దు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలను యధాతథంగా కొనసాగించి ప్రవేశాలు కల్పించాల్సిందిగా ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



విల్లంబులను ఎక్కుపెడుతున్న గిరిజనులు ,వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై ఆందోళన

▸▸అదానీ చిత్రపటాలు దగ్ధం ▸▸విల్లంబులు ఎక్కుపెట్టిన గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి:అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ రేగులపాలెం, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి ఏరియాలో హైడ్రో పవర్ ప్లాంట్ల్ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదాని చిత్రపటాన్ని రేగులపాలెం వద్ద దగ్ధం చేశారు. హైట్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మిస్తే చూస్తూ ఊరుకునేది లేదని తరిమి కోడతామని గిరిజనులు స్పష్టం చేసారు. రేగులపాలెం వద్ద గత నాలుగు రోజుల నుండి అదాని హైడ్రోపవర్ ప్లాంట్లుకు వ్యతిరేకంగా గిరిజనుల ఆందోళన శనివారం కొనసాగింది. అదాని చిత్ర పటాలను దగ్ధం చేసి గిరిజనుల సాంప్రదాయం విల్లుంభులతో పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం నేత డి వెంకన్న మాట్లాడాతూ, పెదకోట ఏరియాలో 1800 మేగవాట్లు ప్రాజెక్టును నిర్మించడం దారుణమన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలోని ఆదివాసీలను వెళ్ల గొట్టేందుకు తీవ్ర మైన ప్రయత్నం చేయడం చట్ట వ్యతి రేఖమన్నారు. హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణంతో పేదకోట ఏరియాలో పెద్దకోట, రేగులపాలెం, కొండిబకోట తదితర గ్రామాలను ఖాళీ చేయించే పనిలో అదాని మనుషులు పూనుకున్నారని, దీన్ని గిరిజనులు ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. జివో 51 ను రద్దు చేయాలన్నారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం మారిక దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీల మద్యలో శారదా నదిపైన 900 మేగవాట్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారని, జీవనదులు ఉన్న చోట ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీంతో రైవాడ ఆయకట్టు రైతులకు, విశాఖ ప్రజల తాగు నీటి అవసరాలకు తీవ్రమైన విఘాతం కలిగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. 1/70 చట్టం, పెసా, అటవీ హక్కులు చట్టాన్ని ధిక్కరిస్తూ ఈ ప్రాజెక్టులకు అనుమతించిన తీరు తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. పీసా చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఏదైనా భూసేకరణకు ముందు, ప్రభుత్వం ప్రాజెక్ట్ సమాచారాన్ని ప్రభావిత గ్రామ పంచాయతీ, గ్రామ సభలతో సంప్రదించి వారి అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ సంప్రదింపుల ప్రక్రియను పూర్తిగా దాట వేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టులపై ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఇప్పటికీ టి.ఎ.సిని నియమించలేదన్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాలలో భూమిని లీజుకు ఇవ్వడం, ఆంధ్రప్రదేశ్ భూ బదిలీ నియంత్రణ ఎల్.టి.ఆర్ చట్టం ద్వారా నిషేధం, షెడ్యూల్డ్ ప్రాంతాలలో ప్రైవేట్ సంస్థలు ప్రాజెక్టులను చేపట్ట లేవని సుప్రీంకోర్టు సమతా కేసులో పేర్కొందని తెలిపారు. అంతే కాకుండా గిరిజన సలహా మండలి టి.ఎ.సి లో ఈ ప్రాజెక్టులపై చర్చ, ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఇప్పటికీ టి.ఎ.సి ని నియ మించలేదన్నారు ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వల్ల కలిగే భారీ స్థాన భ్రమనం గురించి, ఆదివాసీ తెగ వర్గాల జీవనోపాధిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. భూసేకరణ సమస్యకు మించి స్థానిక నీటి వనరులపై ప్రాజెక్టులు ఆధార పడటంతో నీటి భద్రత, ఈ వనరులపై ఆధారపడిన ఆదివాసీ తెగలు, దిగువ రైవాడ లాంటి బారి ప్రాజెక్టు క్రిందన ఉన్న వేలాది ఎకరాలు ఆయకట్టు రైతులపై దాని సామాజిక ప్రభావం గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతాయని తెలిపారు. వీటిని నిలుపుదల చేయకపోతే బావితరాలకు తీవ్రమైన ప్రమాదం ఎర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు కమిటీ సభ్యులు జె.ఈశ్వరరావు, అరుణ్, దేముడు, గోవింద్, ఆర్ కె.డి ఈశ్వరావు, చిన. ఎర్రయ్య, దేముడు, పలు గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



రేషన్‌ను తలపై మోసుకెళుతున్న గిరిజనులు

రేషన్ తీసుకోవాలంటే...
15 కిలోమీటర్లు నడవాల్సిందే!

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని జీనబాడు పినకోట పంచాయతీ పరిధి కొండశిఖరు గ్రామాల రేషన్ లబ్ధిదారులు కష్టాలు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం లేక కిలోమీటర్ల దూరం రేషన్ కోసం డియర్ డిపోలలో కాలినడకన వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. జీన్నబాడు పంచాయతీ దాయర్తి,. పినకోట పంచాయతీ బలగరువు రెండు గ్రామాలకు సంబంధించి 110 మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరు రేషన్ తీసుకునేందుకు పంచాయతీ కేంద్రం వద్ద ఉన్న రేషన్ దుకాణంలో మరో 15 కిలోమీటర్లు ఎత్తయిన కొండకోనలు కాలినడకన ఒకరోజు ప్రయాణం చేస్తూ రేషన్ తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గతంలో గ్రామాలకు సమీపంలోనే ఎండియు వాహనం ఇచ్చేదని అవి రద్దు కావడంతో గిరిజనులు రేషన్ దుకాణాల వద్దకు వెళ్ళవలసింది పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లోని రేషన్ అందించాలని కోరుతున్నారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశాకార్యకర్తలుగా గుర్తించాలి

-జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:ఏళ్ల తరబడి గ్రామంలో అందుబాటులో ఉండి రోగులకు నిత్యం సేవలందిస్తున్న సిహెచ్‌డబ్ల్యూలను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి దిసరి గంగరాజు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, ఇందులో 60 మంది సి హెచ్‌డబ్ల్యూ లు ఐదు నుండి పది సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. వారిని తక్షణమే గుర్తించి ఆశాలు ప్రమోట్ చేయాలన్నారు.పదో తేదీన విడుదల చేసిన జాబితాలో కొంతమంది పేర్లు లేవని తక్షణమే వారిని లిస్టులోకి చేర్చి ఆశాలుగా గుర్తించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా 733 మంది సిహెచ్‌డబ్ల్యూలు పనిచేస్తున్నారన్నారు. దీనిపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందిస్తూ ఆశాలుగా గుర్తించేందుకు ఉన్నత అధికారులు జాబితా విడుదల చేశారని అందులో కొంతమంది పేర్లు లేవని, ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని అన్నారు. ఏ ఒక్కరిని తప్పించినా పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు

గిరిజనాభివృద్ధి మాటల్లోనే.. ఆచరణలో శూన్యం

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మోతుగూడెం

ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రభుత్వం మాటల్లోనే చెబుతుందని, ఆచరణలో అభివృద్ధి శూన్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి గ్రామంలో శనివారం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు డేవిడ్, మగాళ్ధాన్, లైకన్, ముక్తా తదితరులు తమ సమస్యలను తెలియజేశారు. గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డులున్నప్పటికీ పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య చదినన స్థానిక యువతకు జెన్‌కో అధికారులు ఉద్యోగాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎపి జెన్‌కోలో చిన్న చిన్న పనులు గిరిజన సొసైటీలకు ఇవ్వకుండా టెండర్ విధానం ద్వారా కాంట్రాక్టర్లకు కేటాయిస్తున్నారని వాపోయారు. ఎన్నో సంవత్సరాల నుండి పోడు భూములు సాగు చేస్తున్నామని, నేటికీ పోడు పట్టాలు మంజూరు చేయలేదని సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్ కార్డులున్న వారికి పనులు కల్పించకపోవడం దారుణమన్నారు. నిబంధనలు ప్రకారం గిరిజన సొసైటీలకు ఇవ్వాల్సిన పనులను ఎపి జోన్‌కో అధికారులు టెండరింగ్ చేయడం సరికాదని, గిరిజన సొసైటీలకు ఆ పనులు అప్పగించి ఉపాధి కల్పించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు ఈ ప్రాంతం మీద దృష్టి పెట్టకపోతే, గిరిజనులందరినీ ఏకం చేసి పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలంతా ఐక్యతగా ముందుకొచ్చి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా నాయకులు చింత రాంబాబు, బీవీ రమణ, అడ్వకేట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డొంకరాయి గ్రామస్తులతో సిపిఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, లోకనాథం తదితరులు

రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్థానిక తహశీల్దార్ అల్లు సత్యనారాయణ శనివారం హెచ్చరించారు. మండలంలోని బదనాంపల్లి పంచాయతీ చిన్న రేల్లంగిపాడులో శుక్రవారం రాత్రి అక్రమంగా నిల్వ ఉంచిన 1548 కీలోల రేషన్ బియ్యాన్ని పట్టుకోవడం జరిగిందని తహశీల్దార్ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు.ముందస్తు సమాచారం మేరకు తరలించడానికి సిద్ధంగా ఉన్న బియ్యాన్ని సీజ్‌చేసి డిసిసి గోదాంకు తరలించనున్నట్లు ఆయన తెలిపారు. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న బియ్యంతో రెవెన్యూ అధికారులు

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి- రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణమిషన్ ఆధ్వంలో స్థానిక రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అవరణలో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తునట్లు స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ తెలియజేశారు. వైద్యశిబిరంలో పరమహంస యోగానంద నేత్రాలయ వేమగిరి వారిచేమ కంటి పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్ళు మరియు కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) నిర్వహిస్తామని స్వామీజి తెలిపారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చు వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు తీసుకురావాలన్నారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ రోగులను పరిశీలించారు. ఫిట్స్ రోగులకు నాలుగు నెలలకు సరిపడా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బి.పి, షుగర్ పరీక్షలు కూడా చూస్తారని, ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని స్వామీజి తెలిపారు.

కానివాడలో ప్రత్యేక ఆధార్ ఎన్‌రోల్‌మెంట్

ప్రజాశక్తి - వై.రామవరం : కానివాడ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపు నిర్వహించడం జరిగిందని ఎంపిడిఒ బాపన్నదొర తెలిపారు. కలెక్టర్ ఐటిడిఎ పిఒ ప్రత్యేక ఆధార్‌క్యాంప్ నిర్వహించాలని ఆదేశించారు. ఆధార్‌కార్డు లేని ప్రతిఒక్కరూ నమోదు కేంద్రానికి రావాలని తెలిపారు. వర్షం కురుస్తున్నా పలువురు ఆధార్ ఎన్‌రోల్ చేయించుకుంటున్నారు.

పిట్టలపాడులో ఎన్‌ఆర్‌ఎస్‌టిసి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలో ఉన్న మారుమూల గ్రామమైన పిట్టలపాడులో పాఠశాల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 40మంది విద్యార్థులు ఉన్నారన్నారు. పాఠశాల లేక గరిమండకు నడిచి వెళుతున్నారన్నారు. గతంలో నాన్ రెసిడెన్సియల్‌స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ ఉండేదని, గత ప్రభుత్వం రద్దు చేసిందని ఉన్నతాధికారులు స్పందించి, తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ ఐటిడిఎ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఉపకలెక్టర్ ఎంవిఎస్ లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో వరదలపై అవగాహన

ప్రజాశక్తి -విఆర్ పురం: మండల కేంద్రంలోని ధర్మతల్లిగూడెం గ్రామంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రిషికుమార్ ఆధ్వర్యంలో శబరి గోదావరి వరదల గురించి ప్రకృతి విపత్తుల శాఖ వారు 20 మంది ఎన్డిఆర్ఎఫ్ బృందాన్ని మండలంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ వరదలను ఎలా ఎదుర్కొనాలి అనేది ఒక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సోడి నర్సమ్మ తహశీల్దార్, ఎస్ఐ సతీష్‌కుమార్ అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

వరద సహాయ చర్యలను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి-విఆర్.పురం :మండలాల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారిపై నీరు చేరింది. శనివారం మధ్యాహ్నం చింతరేగుపల్లి కన్నాయిగూడెం రోడ్డుపైకి నీరు చేరి రాకపోకలు నిలిచి పోయాయి. సహాయచర్యల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించడానికి చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ శనివారం విఆర్‌పురం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో రిహాబిటేషన్ సెంటర్లను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సరస్వతి, ఎస్ఐ సంతోష్‌కుమార్, డిప్యూటీ డిఎం హెచ్ఒ పుల్లయ్య, స్వచందసేవా సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు, జిసిసి మేనేజర్, ఆర్‌డబ్ల్యూ ఎఇ, రేఖపల్లి సెక్రెటరీ, ప్రభుత్వవైద్యులు అనిల్ ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు.



సహాయచర్యలు పరిశీలిస్తున్న పిఒ

రైతులకు సరిపడా వరి విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : రైతులకు సరిపడా వరి విత్తనాలను పంపిణీ చేయాలని మండలంలోని డౌనూరు సెగ్మెంట్ ఎంపిటిసి సభ్యుడు, వైసిపి మండల అధ్యక్షుడు బిడిజాన అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. చిట్టెంపాడు పంచాయతీలో సర్పంచ్ నేమాని నూకాలమ్మ, గదబపాలెం పంచాయతీ సర్పంచ్ ఉల్లి నర్సమ్మ, డౌనూరు సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకుడు రాజేష్‌తో కలిసి పలువురు రైతులకు ఆయన వరి విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. పలువురు కూటమి నాయకులు, వైసిపి నాయకులు, స్థానికపెద్దలు అధికసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రాజమండ్రి ఒఎన్‌జిసి సిఎస్‌ఆర్ నిధులతో స్వచ్ఛత పక్వాడ్ 2025లో భాగంగా రూ.10లక్షలు విలువచేసే బోర్‌వెల్, షెడ్, ఆర్‌ఒ ప్లాంట్ సమకూర్చారు. శనివారం ఒఎన్‌జిసి ఇడి సంతూన్‌దాస్ ప్లాంట్ ప్రారంభించారు. మంచినీటి కుళాయిలను ఒఎన్‌జిసి సిజిఎం ఆర్.ఎస్.రామారావు, జిఎం కొమ్మ సత్యనారాయణ, సర్పంచ్ గొల్లపూడి రమణి ప్రారంభించారు. అనంతరం హెచ్‌ఎం ఆదిలక్ష్మి, పిఎంసి చైర్మన్ శ్రీనివాసరావు, ఎంఇఒ 2 సూరయ్యరెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీలో పాఠశాలల అభివృద్ధికి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. ఒఎన్‌జిసి అధికారులను పాఠశాల ఉపాధ్యాయులు, పిఎంసి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని గివింగ్ హాండ్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కిరణ్ పర్యవేక్షించారు. ఒఎన్‌జిసి జిఎం రూనా మజుందర్, సంజుక్తదాస్, పాఠశాల హెచ్‌ఎం ఆరిమిల్లి ఆదిలక్ష్మి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంఇఒ-2 సూరయ్యరెడ్డి పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మధ్యవర్తిత్వం ద్వారానే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - రంపచోడవరం: మధ్యవర్తిత్వం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీరు తెల్లంశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, ఐటిడిఎ మొదలైన కార్యాలయాల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన వాల్‌పోస్టర్లు అతికించారన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ నిర్వహిస్తామని వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు సంప్రదించి సమస్యల పరిష్కారం చేసుకుంటారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం, మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, మడకం వరప్రసాద్‌దొర, పద్మారావు, కానిస్టేబుల్స్ ధర్మరాజు, వెంకటేశ్వర్లు, ప్రభావతి పాల్గొన్నారు.

108లోనే ప్రసవం

ప్రజాశక్తి-రంపచోడవరం: రంపచోడవరం గ్రామానికి చెందిన గర్భిణి కె.మల్లేశ్వరిని స్థానిక ఏరియా హాస్పిటల్‌కు శుక్రవారం తీసుకెళ్లారు. అయితే ఆసుపత్రి సిబ్బంది ఆమెకు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని రిఫర్ చేశారు. 108లో తీసుకెళ్తుండగా శుక్రవారం రాత్రి రెండు గంటల సమయంలో సీతపల్లి వద్ద అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. ప్రస్తుతం తల్లీ, బిడ్డ సురక్షితంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని ఒట్టిగెడ్డ గ్రామ శివారున శనివారం ఆర్టీసి బస్సు బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రంపచోడవరం నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టిసి బస్సు దాకరాయి నుండి ఒట్టిగడ్డకు కూలిపనులకు దాకరాయి గ్రామానికి చెందిన మర్రి అచ్చిబాబు, కొర్రా లోవరాజు, పాంగి సూరిబాబు బైక్‌పై వెళతుండగా బస్సు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టిసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ ఇ.నరసింహమూర్తి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



వరి నాట్లు వేస్తున్న మేఘాలయ రైతులు

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, రైతు సాధికార సంస్థ, మేఘాలయ స్టేట్ రూరల్ లైవ్లీ హుడ్స్ సొసైటీ, రాష్ట్ర గిరిజన రైతు సంస్థ ఆధ్వర్యంలో మేఘాలయ రాష్ట్రానికి చెందిన 30 మంది గిరిజన మహిళా రైతులు పది రోజుల శిక్షణ కార్యక్రమం కోసం పాడేరు ప్రాంతానికి తీసుకు వచ్చారు. ఈ శిక్షణలో భాగంగా, పాడేరు మండలంలోని బిర్రిశల గ్రామం, గుర్రంపనుకు గ్రామాలను మేఘాలయ రైతులు సందర్శించారు. ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న వరి పంట, ఏటీఎం మోడల్ క్షేత్రాలను వారు సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, నేల సంరక్షణ, తక్కువ ఖర్చుతో సాగు చేయగల నైపుణ్యాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ రీజనల్ టీం, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 15న జాబ్ మేళాను నిర్వహించనున్నామని జాబ్ మేళా కో-ఆర్డినేటర్ బొజ్జన్న తెలిపారు. సీడాప్, డీడీయూ, జీకేవై ద్వారా యువతకు ఎంప్లాయిమెంట్, ఆపరేటర్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగ యువత విద్యార్హత, కుల, రేషన్, ఉపాధిహామీ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కొరకు 9014412898కు సంప్రదించాలని ఆయన కోరారు.

నైపుణ్య శిక్షణకు ఒప్పందం

ప్రజాశక్తి- సీతమ్మధార : నైపుణ్య శిక్షణపై సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సిటిడి)తో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సిటిడి ప్రిన్సిపల్ డైరెక్టర్ విజయకృష్ణకాంత్ మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా కళాశాల విద్యార్థులకు పలు శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇండస్ట్రీ 4.0 అవసరాలకు అనుగుణంగా అన్ని విభాగాల ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్. జి. మధుకుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన పరిజ్ఞానంతో సమకాలీన అంశాలపై అవగాహన అవసరమన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. దీపక్‌చౌదరి, ఎంఎస్ఎంఇ కన్సల్టెంట్ కె.ఎస్.ఎస్. ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రీన్ ట్రెండ్స్ సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి - గాజువాక: 'హెయిర్ కట్ నుంచి బ్రైడల్ లుక్ వరకు కస్టమర్ విశ్వాసాన్ని చూరగొన్న 'గ్రీన్ ట్రెండ్స్ సెలూన్' ను గాజువాక చినగంట్యాడలో హనుమాన్ ఫిలిం ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో సినీ నటి సురభి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురుషులు, మహిళల ఆదరణ పొందుతున్న సెలూన్ ఇదని, ఇక్కడ శిక్షణ పొందిన వారే పనిచేస్తారన్నారు. అనతికాలంలోనే ప్రజాదరణ పొందుతుందని అభిలషించారు.

ఈ సందర్భంగా ఫ్రాంఛైజ్ ప్రతినిధులు బూరాడపాటి దివ్య, బాసిరెడ్డి దివ్యారెడ్డి, అల్లు నివేదిత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రీన్ ట్రెండ్స్ బ్రాండ్‌కు ఎంతో మంచి పేరుందన్నారు. వినియోగదారుల అభిరుచుల మేరకు ఆధునిక సేవలు అందిస్తామన్నారు. కూర్మన్నపాలెంలో మరో సెలూన్ కూడా ప్రారంభించామన్నారు. సినీనటి సురభి వస్తుందని ప్రచారంతో పెద్దఎత్తున సినీ అభిమానులు అక్కడికి చేరుకున్నారు. వారితో సెల్ఫీలు దిగుతూ సురభి సందడి చేశారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న అటవీశాఖాధికారులు

80 వేల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- సీలేరు: సీలేరు దారకొండ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో 80,000 జాపరా మొక్కలను శనివారం పంపిణీ చేశామని అటవీ శాఖ రేంజ్ అధికారి వెంకటరావు వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు నర్సరీలో 40 వేలు దారకొండ నర్సరీలో 40 వేలు మొక్కలు గిరి రైతులకు పంపిణీ చేశామన్నారు. జాపరా వలన అధిక లాభాలు రావడంతో వీటిని సాగు చేయటానికి గిరి రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి సతీష్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లోవరాజురాకేష్, దారకొండ ఎంపీటీసీ మాడి రామన్న సర్పంచి ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అబాకస్ ప్రతినిధులు

విశాఖలో ఎస్ఐపి అబాకస్ తొలి శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ప్రపంచవ్యాప్తంగా అబాకస్ శిక్షణలో గుర్తింపు పొందిన ఎస్ఐపి అబాకస్ సంస్థ విశాఖలో తన తొలి బ్రాంచ్ ను ఎంవిపి కాలనీ ఉషోదయ ప్రాంతంలో శనివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్ మాట్లాడుతూ 2003లో ప్రారంభించిన తమ సంస్థ దేశవ్యాప్తంగా 385 నగరాలతో పాటు 11 దేశాల్లో విస్తరించిందని గత 22 సంవత్సరాలుగా ఎస్ఐపి అబాకస్ పది లక్షలకు పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. అంతేకాకుండా తమ వద్ద 5 వేల మందికి పైగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని ఆయన తెలిపారు. అనంతరం సంస్థ స్టేట్ హెడ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తమకు 22 కేంద్రాలు ఉన్నాయని ప్రస్తుతం 3500 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు ఈ శిక్షణకు ఆరు సంవత్సరాల నుండి 12 సంవత్సరాల వయసు గల పిల్లలు జీవిత నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందని ఆయన స్పష్టం చేశారు. అబాకస్ యొక్క శిక్షణ వారానికి రెండు రోజుల శని, ఆదివారాల్లో ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో సంస్థ రీజినల్ బిజినెస్‌హెడ్ ఇ.జి.ప్రవీణ్, విశాఖపట్నం అసోసియేట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విశాఖ వాసికి తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు, భారతరత్న పి.వి.నరసింహారావు జయంతి ఉత్సవాలు 2025లో భాగంగా తెలుగు వెలుగు సాహితీవేదిక జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం వ్యవస్థాపకులు పోలోజు రాజ్‌కుమార్ త్యాగరాయ గానసభలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు బ్రహ్మశ్రీ వంగాల శాంతికృష్ణ , బ్రహ్మశ్రీ దైవజ్ఞశర్మ , విశిష్ట అతిథులు డాక్టర్ శాంతాభాయి పాల్గొని వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ప్రముఖ సంఘసేవకులు సేవారత్న కొండపి ఎస్.వి.గణేష్ బాబుకు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నటరత్న పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు, భారతరత్న పి.వి.నరసింహారావు జయంతి పురస్కారం ప్రధానం చేశారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీవేదిక సభ్యులు రేవతి రజినిరెడ్డి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ ప్రశాంతి, బ్రహ్మశ్రీ నాగరాజు, బ్రహ్మశ్రీ విష్ణువర్ధన్ తమ సందేశాన్ని అందించారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు సహించం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -పాడేరు: అంగన్వాడి, ఆశ, మిడ్ డే మిల్క్, వివోఏలపై రాజకీయ వేధింపులు చేస్తే సహించేది లేదని. సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం పాడేరు సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో స్కీం వర్కర్లైన. అంగన్వాడి. ఆశ, సిహెచ్ డబ్ల్యు, మధ్యాహ్న భోజనం, కార్మికులు, వెలుగు వివోఏలకు స్థానికంగా పనిచేసే గ్రామాలలో కింద స్థాయి రాజకీయ పార్టీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

ఎన్నో సంవత్సరాలుగా ఆ వృత్తినే నమ్ముకున్న కార్మికులు చాలీ చాలని జీతభత్యాల కోసం ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోరాటం చేస్తుంటే ఆ పోరాటం చాలదన్నట్టు క్రింద స్థాయిలో రాజకీయ నాయకుల వేధింపులు మరోవైపు భరించవలసి వస్తుందని ఆరోపించారు. అంగన్వాడీలు ఫీడింగ్ సరిగా ఇవ్వలేదని. ఆశ వర్కర్లు సరిగా డ్యూటీ చేయలేదని. మధ్యాహ్నం భోజనం కార్మికులు మెనూ అమలు చేయలేదని ఆరోపణలతో ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించకుంటే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి. లింగేరి సుందర్‌రావు, జి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు. జీనబంధు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వేరు శనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- హుకుంపేట: శనివారం వారపు సంతలో వేరు శనగలకి గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. బస్తాకు కేవలం రూ.800 ధర మాత్రమే పలకడంతో రైతులు అమ్మకాలు నిలిపేసి తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. శుక్రవారం బస్తా ధర రూ.1900 ఉండగా, ఒక్క రోజులోనే వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి భారీగా ధర తగ్గించారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం కార్యదర్శి తాపుల కృష్ణారావు రైతుల వద్దకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. వేరు శనగ పంటను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని, మధ్యాహ్న భోజనాల్లో వాడేందుకు స్కూళ్లకు సరఫరా చేయాలని సూచించారు.వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు రూ.3000 కోట్లు కేటాయిస్తామన్న హామీలను విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీ.సంపంగిపుట్టు గ్రామ రైతులు కృష్ణబాబు, భాస్కర్‌రావు, కొండబాబు, గణేష్, సీతన్న, సతీష్, సత్తిబాబు, శుక్రన్న, డోంబు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ ఫ్రీ రాష్ట్రం లక్ష్యం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రజాశక్తి- కొమ్మాది : డంప్‌యార్డ్ ఫ్రీ రాష్ట్రంగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనిస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో జివిఎంసికి స్థానం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఐదో వార్డు కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. డంపింగ్ యార్డ్ వద్ద పరిస్థితులు పర్యవేక్షించి, ఘనవ్యర్థాల నిర్వహణ, వేస్ట్ ఎనర్జీపై జివిఎంసి అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, దాని ఫలితంగానే జివిఎంసికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డుతోపాటు రాష్ట్రంలో గుంటూరు, తిరుపతి, రాజమండ్రి నగరపాలక సంస్థలకు సూపర్ స్వచ్ఛలీగ్‌లో చోటు దక్కిందన్నారు. జివిఎంసి పరిధిలోని వ్యర్థాలను రెండు నెలల్లో క్లియర్ చేసేందుకు 95 ఎలక్ట్రిక్ వాహనాలను అందిస్తామన్నారు. రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయాలన్న సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా విశాఖలో చెత్త నిర్వహణ బాధ్యతను జిందాల్ సంస్థకు అప్పగించామన్నారు. డ్రోన్‌లు పెట్టి మొత్తం చెత్తను క్లియర్ చేస్తామన్నారు.జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ఏడాదిలో జివిఎంసికి రెండు అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో ఎడిసి రమణ, సిఎంఒహెచ్ నరేష్, జెడ్‌సి కనకమహాలక్ష్మి, ఎఎంహెచ్‌ఒ కిషోర్, జిందాల్, జిగ్మా ప్రతినిధులు పాల్గొన్నారు



కాపులుప్పాడ డంపింగ్‌యార్డు పరిశీలనలో పట్టాభిరాం

కొమరం భీం విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్

ప్రజాశక్తి - వి ఆర్‌పురం : కూనవరం మండలం కోతులగుట్టలో ఉన్న స్వతంత్ర పోరాటయోధుడు కొమరంభీం విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటని అదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివాసిల మనుగడకు ఆయన ఒక ఆధారం అని అలాటి వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరికాదని ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూనవరం: మండలంలోని కోతులగుట్టలో ఎంపిడిఒ కార్యాలయం ముందు ఉన్న కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని గిరిజన సంఘం మండలం కార్యదర్శి తెల్లం తమ్మయ్య తెలిపారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి బాబు బొర్రయ్య, నూపరాజు, సర్పంచ్ సోడె శంకర్ , సోడె సుమన్,పాయం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



పులి సంతోష్‌కుమార్

శాంతియుత నిరసనకు అనుమతి ఇవ్వలేదు

కోతులగుట్టలో కొమరం భీం విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఆదివాసీ ప్రజలు తమ శాంతియుత నిరసన వ్యక్తం చెయ్యడానికి అనుమతి కోరితే నిరాకరిం చడం సరికాదని ఆదివాసి న్యాయవాది మడివి రవితేజ పేర్కొన్నారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి తన అభిప్రాయాన్ని తెలియజేసే హక్కు ఉందన్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి



తాత్కాలికంగా నిర్మించుకుంటున్న పాకలు



రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి - విఆర్‌పురం:

మండలంలోని గోదావరి, శబరి పరీవాహక గ్రామాలైన చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, వడ్డుగూడెం, ధర్మతాలగూడెం గ్రామస్తులు శ్రీరామగిరి, గుట్టలపైన పాకలు వేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. శనివారం నాలుగు గంటలకు భద్రాచలం వద్ద 41.30 అడుగులు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వడ్డుగూడెం, ధర్మతాళ్లగూడెం గ్రామస్తులు ముందుగా రేఖపల్లిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి గృహనిర్మాణ సామగ్రిని తీసుకువెళ్తున్నారు. చింతరేగపల్లి, కన్నాయిగూడెం, గ్రామాల మధ్య నీరు రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఇంకో ఎనిమిది అడుగులు వస్తే విఆర్‌పురానికి వడ్డుగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని ముందుగా వారు సామాన్లు రేఖపల్లికి తీసుకువెళ్తున్నారు. వడ్డుగూడెం నుండి రేకపల్లి వరకు సామాన్లు తీసుకువెళ్లడానికి రూ.2వేల నుంచి రూ.5వేల వరకూ ఖర్చు అవుతోందని ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరారు.

ఎటపాక: గోదావరి వరద ఉధతి పెరుగుతుండడంతో ముంపు ప్రాంతాల ప్రజలు భయాందోళనతో ఉన్నారు. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రానికి గోదావరి వరద నీటిమట్టం 41.30 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. 43 అడుగుల చేరితే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అయితే ఇప్పటికే వాగుల నుండి వరద ఎగపోటుతో మురుమూరు, నందిగామ, గౌరిదేవిపేట, తోటపల్లి, నెల్లిపాక గ్రామాల్లో పలచోట్ల జామాయిల్ తోటలు నీట మునిగాయి. మరో రెండు అడుగులు పెరిగితే నెల్లిపాక నుండి వీరాయిగూడెం మధ్య రహదారి పైకి నీరు చేరుతుంది. ఎగువ నుండి వరద తగ్గ ముఖం పట్టడంతో భద్రాచలం వద్ద వరద నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు సూచించారు. నిత్యావసర సరుకులు గ్రామాలకు చేర్చాలని ఆయా గ్రామస్తులు అధికారులను కోరారు

ఇగ్నో అధ్యయన కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

పాడేరు డిగ్రీకళాశాలలో కేంద్రం ఏర్పాటు
కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టిబ్బాయితో సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో), విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం తమ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక అధ్యయన కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. నీతిఆయోగ్ ద్వారా ఆకాంక్షాత్మక జిల్లాగా ప్రకటించబడిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇగ్నో కేంద్రం స్థాపన ఆ జిల్లాలోని ఎందరో నిరుద్యోగుల, విద్యార్థుల అవసరాలు తీర్చడానికి ఉపయోగపడుతుందని ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. శనివారం స్థానిక ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆవరణలో పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిట్టబ్బాయితో జరిగిన సమావేశంలో అధ్యయన కేంద్రం ఏర్పాటుకు సంబంధించి చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇగ్నో అధ్యయన కేంద్రం ద్వారా డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులను అల్లూరి జిల్లా చుట్టూ పక్కల ప్రాంతాలలోని విద్యార్థులకు, ఉద్యోగార్థులకు చేరువ చేయగలమని, దీనిద్వారా ఆ ప్రాంత యువకులకు ఉద్యోగావకాశాలు పెరగుతాయన్నారు. పాడేరు డిగ్రీ కళాశాలలో అధ్యయన కేంద్ర ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్రిన్సిపాల్ డాక్టర్ వి. చిట్టబ్బాయికి ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి. చిట్టబ్బాయి తమ కళాశాలలో ఇగ్నో అధ్యయన కేంద్రం కేంద్రం స్థాపించడానికి అంగీకరించిన ఇగ్నో సంచాలకులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరగా ఏర్పాటు చేసి, ఆ ప్రాంత విద్యార్థులకు అవసరమైన అన్ని కోర్సులు అందుబాటులోకి తెచ్చి, ఉన్నత విద్యాప్రమాణాలతో కేంద్రాన్ని నడపటానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు ఇగ్నో కోర్సులు, కార్యక్రమాల వివరాల్ని ప్రిన్సిపాల్‌కి వివరించారు



ఇగ్నో ప్రతినిధులతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిట్టిబ్బాయి

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బంగారం గరువు గ్రామంలో శనివారం ఓ ఎద్దు విద్యుత్ స్థంబాన్ని తాకి అక్కడికక్కడే మృతి చెందింది. రైతు ఒరబోయిని గుండన్న కు చెందిన ఈ ఎద్దు విద్యుత్ స్థంబాన్ని తాకడంతో షాక్ తగిలి మృతి చెందింది. సమాచారం అందుకున్న గ్రామస్థులు తక్షణమే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. . రైతు గుండన్న మాట్లాడుతూ, ' ఎద్దు కొనాలంటే రూ.30 వేలు నుండి 40 వేల వరకు ఖర్చవుతుందన్నాడు. ప్రభుత్వం స్పందించి రైతుకి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు కొత్తపాలెం దరి డిఆర్ నగర్ శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న పెద్దిపాటి లోకేష్ (33) వారం రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి పెద్దిపాటి మల్లేశ్వరరావు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.

పెద్దిపాటి మల్లేశ్వరరావు ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన పెద్దిపాటి లోకేష్ శంకర ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌లో జూనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గత శనివారం డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం మధ్యాహ్నం తనకు బతకాలని లేదని, చనిపోతానని అతని వాట్సాప్ స్టేటస్‌లో మెసేజ్ పెట్టాడు. దీనిపై ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అతని స్నేహితులు వద్ద విచారించగా, లోకేష్ కొందరి వద్ద అప్పులు చేశాడని, అందుకే ఆత్మహత్య చేసుకుంటానని ఫ్రెండ్స్‌కు చెప్పినట్లు తెలిసింది తర్వాత లోకేష్ ఫోను స్విచ్ఛాఫ్ అయ్యింది. తన బిడ్డ ఆచూకీ కనిపెట్టాలని లోకేష్ తండ్రి పెద్దిపేట మల్లేశ్వరరావు కోరాడు.

కార్మికుల పోరాటంతోనే ఉక్కు ప్రయివేటీకరణకు అడ్డుకట్ట

విశ్రాంత ఉద్యోగుల సన్మానసభలో డాక్టర్ గంగారావు

ప్రజాశక్తి-గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టడానికి నాడు వైసిపి, నేడు కూటమి పార్టీలు చూస్తున్నాయని, అయితే అకుంఠితదీక్షతో కార్మికులు చేసిన పోరాటాలతోనే ఇప్పటివరకు ప్రయివేటీకరణకు అడ్డుకట్ట పడిందని 78వ వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి గంగారావు అన్నారు. శుక్రవారం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు వైటి.దాస్, టి.చిన్నబాబు, కె.ముత్యాలనాయుడు, కె.సుబ్బారావులను అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 35ఏళ్లకుపైగా పనిచేసి, ప్లాంట్ పరిరక్షణకు, కార్మికుల ప్రయోజనాలకు జరిగిన పోరాటాల్లో ఇలాంటివారే పాల్గొన్నారని కొనియాడారు. ప్రభుత్వరంగం నుంచి ప్రయివేటుకు దారాదత్తమైన ముమ్మందు ఇటువంటి అభినందన సభలు సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రాత్రికిరాత్రే నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఒత్తిడి తెచ్చి రెగ్యులర్ కార్మికులకు విఆర్‌ఎస్ ఇస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి వారి స్ఫూర్తితో నేటితరం స్టీల్‌పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, ప్రజలు, కార్మికుల శ్రేయస్సు కోసం సిపిఎం, సిఐటియు పనిచేస్తున్నాయని, అలాంటి యూనియన్‌లో పనిచేసిన వీరు నలుగురు అభినందనీయులన్నారు. ప్రజలకు ఎక్కడ కష్టం వచ్చినా అక్కడ వీరు ఉంటారని గుర్తు చేశారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌కు ఒక ప్రత్యేకత ఉ ందని, ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించడం ఇక్కడ ప్లాట్ ఓనర్స్‌కు ఆనవాయితీగా మారిందన్నారు.ఉద్యోగ విరమణ చేసిన నలుగురూ ఒకే ఆశయం కోసం పనిచేశారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు జె రామన్న అధ్యక్షతన జరిగిన సన్మాన భలో వైవి.చౌదరి, మహిళా కమిటీ అధ్యక్షులు రమణి, సెక్రటరీ శాంతి పాల్గొన్నారు.



కార్మికులకు మందులు, పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

క్రెడాయ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

- ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: నగరంలోని నిర్మాణ కార్మికుల కోసం ఉచిత వైద్యశిబిరాన్ని భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ఎండాడలో ప్రారంభించారు. శిబిరాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) విశాఖపట్నం చాప్టర్, ఎం.కె.వన్ గీతం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ రంగానికి బలంగా నిలిచే కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిర్వహించిన కార్యక్రమం అభినందనీయమ న్నారు. వైద్యశిబిరంలో విశాఖపట్నంలోని వివిధ నిర్మాణ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 550 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు. వారికి ఉచిత వైద్యపరీక్షలు, రోగ నిర్ధారణ సేవలు, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు బిపి, షుగర్, ఇఎన్‌టి, కంటి, దంత పరీక్షలు నిర్వహించినట్టు జిమ్మెస్సార్ వైద్య నిపుణులు తెలిపారు. జీవనశైలి వ్యాధులు, వత్తిపరమైన ఆరోగ్య సమస్యలపై నిపుణులు మార్గదర్శనం చేశారు. శిబిరానికి హాజరైన 550 మంది కార్మికులకు మందులు, పంపిణీ చేశారు. క్రెడాయ్ కార్యనిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎం శ్రేణిని ఆవిష్కరించిన శామ్‌సంగ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : శామ్‌సంగ్ తన సరికొత్త స్మార్ట్ మానిటర్ ఫ్యామిలీని ప్రకటించింది. ఇందులో విలాసవంతమైన ఎం 9, ఎం 8, ఎం7 మెరుగైన ఎడిషన్‌లు ఉన్నాయని, అధునాతన ఎఐ ఫీచర్లతో, కొత్త ఉత్పాదనలు పని, వినోదం కోసం కనెక్ట్ చేయబడి స్క్రీన్‌ను అందిస్తాయని శామ్‌సంగ్ ఇండియా ఎంటర్ప్రైజ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ పునీత్‌సేథి తెలిపారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు.

రోజ్‌గార్ మేళా

ప్రజాశక్తి - సీతమ్మధార : విశాఖపట్నంలోని కైలాసపురంలోని సాగరమాల కన్వెన్షన్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్టెయిర్ డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే ద్వారా శనివారం రోజ్‌గార్ మేళా నిర్వహించారు. విశాఖపట్నంలో కొత్తగా నియమితులైన అభ్యర్థులకు కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కూడా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 52 మందికి నియామకపత్రాలను అందజేశారు.